క్లుప్తంగా

నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోండి

భట్టిప్రోలు: ఈ నెల 18 నుంచి 30 వరకు పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో నీలం దేవరాజు బుధవారం తెలిపారు. భట్టిప్రోలు మండలంలోని టీఎం రావు హైస్కూల్, ఐలవరం, వెల్లటూరు, పెద పులివర్రు, పల్లెకోన జిల్లా పరిషత్ హైస్కూళ్లల్లో పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 599 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు. పరీక్షల నిర్వహణకు 47 మంది ఇన్విజిలేటర్లు, ఐదుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, ఒక డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను నియమించినట్లు తెలిపారు. ఇన్విజిలేటర్లకు 16న శిక్షణా కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి రోజు పరీక్ష ఉదయం 9:30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12:45 గంటలకు ముగుస్తుందన్నారు. నిర్ణీత సమయానికి విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేత



రేపల్లె రూరల్: ఈ నెల 18 నుంచి పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతున్న సందర్భంగా పట్టణంలోని త్రిబుల్ ఎస్ హైస్కూలులో పదో తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు పట్టణ ఆదర్శ వేదిక సభ్యులు పెన్నులు, ప్యాడ్లు, ఇతర పరీక్షా సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం జానీబేగ్, ఆదర్శ వేదిక సభ్యులు మోహనరావు, ఎస్.సాయికృష్ణమాచార్యులు, నటరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఓరియంటల్ హైస్కూలులో 10 మంది విద్యార్థులకు, పేటేరు జెడ్పీ హైస్కూలులో 140 మంది విద్యార్థులకు వేదిక సభ్యులు పరీక్ష సామాగ్రిని అందజేశారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఈ నెల 14న గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శేషాద్రి బుధవారం ఒక ప్రకటనలతో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

విద్యుదాఘాతంతో గృహం దగ్ధం



కొల్లూరు : విద్యుదాఘాతం కారణంగా ఓ గృహం దగ్ధమైన సంఘటన కొల్లూరు శివారు బోస్‌నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, రెవెన్యు సిబ్బంది కథనం మేరకు సభావత్తు దుర్గమ్మ తన కుమారుడితో కలసి బోస్‌నగర్ సాయిబాబా ఆలయ సమీపంలో రేకుల ఇంట్లో నివాసం ఉంటుంది. ఆమె బుధవారం తన కుమారుడితో కలిసి స్థానికంగా వ్యవసాయ కూలీ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి భారీగా మంటలు ఎగసి పడుతుండటంతో స్థానికులు గమనించి మంటలను అదుపు చేసేందుకు ప్రయతి్నంచారు. మంటలు ఇల్లు మొత్తాన్ని చుట్టుముట్టడంతో ఇంటిలో ఉన్న సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది. తెనాలి నుంచి వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదం కారణంగా సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు రెవెన్యూ అధికారులు అంచనా వేశారు.

బీమా పాలసీలను సద్వినియోగం చేసుకోండి



చెరుకుపల్లి: బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు అందించే సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని చెరుకుపల్లి బ్రాంచ్ మేనేజర్ అద్దంకి శ్రీకాంత్ కోరారు. స్థానిక బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ నందు డ్వాక్రా యానిమేటర్‌లు, ఖాతాదారులకు కేర్ హెల్త్ ఇన్సూరెన్స్‌పై బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం అక్టోబర్ లో 1,270 మంది డ్వాక్రా సంఘ సభ్యులకు ఒక్కొక్కరికీ రూ1,499 ప్రీమియం చెల్లించి ఐదు లక్షలకు ఇన్సూరెన్సు చేశామన్నారు. డ్వాక్రా సభ్యులతో పాటు ప్రతి ఒక్కరూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించే ఇన్సూరెన్స్ పాలసీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేర్‌హెల్త్ ఇన్సూరెన్స్ క్లస్టర్ మేనేజర్ వై భాను, ఏరియా మేనేజర్ డి నాగార్జున, డ్వాక్రా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధికే తొలి ప్రాధాన్యం

- నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు
- మహిళలకు నాలుగో విడత చేయూత నమూనా చెక్కు అందజేత



మహిళలకు చేయూత నమూనా చెక్కును అందజేస్తున్న వరికూటి అశోక్‌బాబు

వేమూరు: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత ద్వారా వారికి అండగా నిలబడ్డారని నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు అన్నారు. వేమూరు మార్కెట్ యార్డులో వైఎస్సార్ చేయూత నమూనా చెక్కును బుధవారం అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే మహా సంకల్పంతో సీఎం పని చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన పథకాల ద్వారా ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం అవుతుందన్నారు. వేమూరు మండలానికి గానూ వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ. 102 కోట్లు మహిళల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. నియోజక వర్గంలోని భట్టిప్రోలు, కొల్లూరు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో సైతం వైఎస్సార్ చేయూత పథకం సొమ్మును మహిళల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సజ్జా లక్ష్మీ తిరుపతమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గాజుల హేమలత, మార్కెట్ యార్డు చైర్మన్ ఉప్పు శిరిష, భట్టిప్రోలు ఎంపీపీ లలిత కుమారి, బొల్లిముంత ఏడుకొండలు, దాది సుబ్బారావు, ఎంపీపీ జాలాది రూబేను తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



ఎమ్మెల్యే కోన చేతుల మీదుగా చెక్కును అందుకుంటున్న బాధితుడు

బాపట్ల: ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్నవారికి సంజీవనిలా ఉపయోగపడుతుందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు.బాపట్ల మండలంలోని 25 మందికి రూ.25 లక్షల సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే రఘుపతి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో పాటు వైద్యం, విద్యకు విశేష కృషి జరుగుతుందన్నారు. ఒక పక్కన ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం అందించటంతో పాటు ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సైతం సాయం అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, నాయకులు గవిని కృష్ణమూర్తి, దొంతిన ఏడుకొండలరెడ్డి, కృష్ణారెడ్డి, గుడారాంకయ్య, గంపాల బాల రామకృష్ణారెడ్డి, కుక్కల సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యకర సమాజం



పోషణ్ పఖ్వాడాలో భాగంగా ప్రదర్శించిన ఆహార పదార్థాలు



ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు, ఐసీడీఎస్ సిబ్బంది

ఓలేరు(భట్టిప్రోలు): పౌష్టికాహారం ఆవశ్యకతతో పాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడమే పోషణ్ పఖ్వాడా ప్రధాన లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫజరున్నీస్సా పేర్కొన్నారు. అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పల్లెకోన సెక్టార్ పరిధిలోని ఓలేరు వెంకట్రాజునగర్‌లో బుధవారం పోషణ్ పఖ్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఫజరున్నీస్సా మాట్లాడుతూ ఆహార పద్ధతులను అలవరచటంతో పాటు, పోషకాహారాన్ని గర్భిణీ స్త్రీలు, చిన్నారులకు అందించేందుకు పఖ్వాడా దోహదపడుతుందని తెలిపారు. ఐసీడీఎస్ అందించే బాలామృతం, పాలు, గుడ్లు, రక్తహీనత నివారణకు పంపిణీ చేసే ఆహార పదార్థాలు, బాలామృతంతో రూపొందించిన పదార్థాలను పోషణ్ పఖ్వాడాలో ప్రదర్శించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ చైతన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలలో పోషక విలువలు అధికం

కొల్లూరు : చిరుధాన్యాలను స్వీకరించడం ద్వారా శరీరానికి అవసరమైన పోషక విలువలు సమృద్ధిగా అందుతాయని దోనేపూడి, కొల్లూరు సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నగరాజ కుమారి, విజయలక్ష్మిలు అన్నారు. బుధవారం మండలంలోని తోకలవారిపాలెం, తురకపాలెం, కొల్లూరు, గొడపాలెం అంగన్‌వాడీ కేంద్రాలలో పోషన్ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా గర్భిణీలు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిరు ధాన్యాలతో కూడిన ఆహార పదార్థాలను తయారు చేసుకోవడం, మొలకలు వచ్చిన చిరుధాన్యాలను తీసుకోవటం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చునన్నారు.దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో రక్తహీనత దూరం

కర్లపాలెం: పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవటం ద్వారా రక్తహీనతను నివారించుకోవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.నాగమల్లేశ్వరి తెలిపారు. బుధవారం పేరలి గ్రామంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలకు వంటల పోటీలు నిర్వహించారు. అనంతరం నాగమల్లేశ్వరి మాట్లాడుతూ గర్భవతులలో రక్తహీనతను నివారించుకోవటం వలన ఆరోగ్యవంతమైన బిడ్డలను సమాజానికి అందించగలుగుతామని చెప్పారు. బాలింతలు, గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. చిరు ధాన్యాలతో పాటు ఆకు కూరలు, పండ్లు ఆహారంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ప్రియాంక, మహిళా పోలీస్ హేమ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

నకిలీ ఆధార్‌తో అక్రమ రిజిస్ట్రేషన్

- రూ.10 లక్షల భూమి యజమానికి తెలియకుండానే అమ్మకం
- అడ్వాన్స్ ఇచ్చిన వ్యక్తి ఈసీలను తీసుకోవడంతో వెలుగులోకి వచ్చిన వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు
- న్యాయపోరాటానికి సిద్ధమవుతున్న బాధితుడు



అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిన నివేశనస్థలం

పెదకాకాని: పెదకాకాని: నకిలీ ఆధార్ కార్డుతో అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌కు పెదకాకాని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వేదికగా మారింది. కార్యాలయంలో కొందరు సిబ్బందికి అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేయించే వారితో సంబంధాలు ఉండటంతో బీ ఫారాలు, గ్రామ కంఠంలో ఉన్న భూములకు సైతం యథేచ్ఛగా రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నట్లు విమర్శలున్నాయి. ఈ క్రమంలో గుంటూరుకు చెందిన సజ్జా సాంబశివరావు 1984లో పెదకాకాని మండలం అగతవరప్పాడు గ్రామ పరిధిలోని సర్వే నంబరు 116ఏ లో ఉన్న 149 చదరపు గజాల స్థలం కొనుగోలు చేశాడు. ఈ స్థలానికి సంబంధించి కొందరు ఈసీకి దరఖాస్తు చేశారు. దాని ఆధారంగా నకళ్లకు దరఖాస్తు చేశారు. ఆ నకళ్లు చూపించి స్థల యజమాని అమ్మినట్లు గుంటూరుకు చెందిన జొన్నలగడ్డ మరియమ్మ పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. వాస్తవానికి రిజిస్ట్రార్ నకళ్లపై రిజిస్ట్రేషన్ జరగాలంటే అధిక సర్క్యులేషన్ ఉన్న దిన పత్రికలో ప్రకటన ఇవ్వడం, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఎన్‌ఓసీ తీసుకోవడం తప్పనిసరి. అలాంటివి ఏమీ లేకుండానే ఒక చిన్న పత్రికలో ప్రకటన ఇచ్చి, నకిలీ ఆధార్ కార్డుతో సజ్జా సాంబశివరావు అమ్మినట్లు ఫిబ్రవరి 2న రిజిస్ట్రేషన్ చేశారు. సరిగ్గా 25 రోజులకే స్థలం హద్దులు తప్పులు పడ్డాయని, ఫిబ్రవరి 27న సరవణ చేయించారు. అదే రోజు గుంటూరుకు చెందిన ఏరువ జయప్రకాష్‌రెడ్డికి జొన్నలగడ్డ మరియమ్మ చేత 3 గంటల వ్యవధిలోనే అదే పెదకాకాని రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు.

అక్రమ రిజిస్ట్రేషన్ వెలుగులోకి వచ్చిందిలా..

ఇటీవల ఆ స్థలాన్ని కొనుగోలు చేసేందుకు వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఒప్పందం కుదుర్చుకున్న ధరలో 4వ వంతు నగదు చెల్లించి ఈసీకి దరఖాస్తు చేసుకున్నాడు. ఈసీల్లో జొన్నలగడ్డ మరియమ్మ, ఏరువ జయప్రకాష్‌రెడ్డి పేర్లు ఉండటంతో ఆందోళన చెంది స్థలం కొనుగోలుకు ఇచ్చిన అడ్వాన్స్ తిరిగి తీసుకోవడంతో నకిలీ ఆధార్, నకళ్లపై డాక్యుమెంట్ సృష్టించి అమ్మకాలు చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పెదకాకాని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అడ్డాగా గత కొంతకాలంగా పలు అక్రమ రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి. అసైన్డ్ భూములకు, ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన బీఫారాలకు, గ్రామ కంఠాలకు ప్రక్కన ఉన్న సర్వే నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్ చేయడం సర్వసాధారంగా మారింది. వివాదాస్పదంగా మారిన వెంచర్లలో ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి విచారించి చర్యలు తీసుకోవాలని భూముల యజమానులు, ప్రజలు కోరుతున్నారు. దీనిపై రిజిస్ట్రార్ జాన్‌మోహన్‌రావును వివరణ కోరగా 1984 లో స్టాంపులపై భూమి యజమాని ఫోటో లేకపోవడంతో నకిలీ ఆధార్ సృష్టించి, అసలు యజమానిగా నమ్మించి రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. అసలు యజమానులతో మాట్లాడటం జరిగిందని అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్లటౌన్: పోలీస్ కుటుంబాలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఇటీవల మృతి చెందిన మరియదాస్ కుటుంబ సభ్యులకు బుధవారం ఫ్లాగ్ ఫండ్, విడో ఫండ్ చెక్‌లను అందజేశారు. జిల్లాలోని కొరిశపాడు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ మరణించిన డి.మరియ దాస్ సతీమణి ఎస్తేర్ రాణికు విడోఫండ్ రూ. 50 వేలు, ఫ్లాగ్ ఫండ్ రూ.25 వేల చెక్కులను అందజేశారు. తొలుత ఎస్పీ స్వయంగా బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ బి సెక్షన్ సూపరింటెండెంట్ రాధిక, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

గీతాంజలి మృతి కారకులపై చర్యలు చేపట్టండి



బాపట్ల: గుంటూరు జిల్లా తెనాలికి చెందిన గీతాంజలి ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ బాపట్ల జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఎమ్మెల్యే కోన రఘుపతిని కలిసి వినతి పత్రం అందించారు. కోన నివాసంలో బుధవారం రాత్రి కలిసిన సభ్యులు సోషల్ మీడియా ద్వారా ఆమె మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ విషయంపై వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి రూ.20 లక్షలు ప్రకటించటంపై హర్షం వ్యక్తం చేశారు. కోనను కలిసిన వారిలో సంఘం నాయకులు వెదురుపర్తి లక్ష్మణమూర్తి, ఏ.నాగేశ్వరరావు, జగదీష్‌కుమార్, వెంకట నరసింహారావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దండి



చెరుకుపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఈవో పులి లాజర్ కోరారు. చెరుకుపల్లి మండలం కొత్తపేట లోని ఎంపీపీఎస్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలను నేర్పించాలన్నారు. పాఠశాలలో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎ బాలాజీ, ఉపాధ్యాయులు కాటూరి నాగేశ్వరరావు, జె నక్షత్ర, కె సుసీల, పీఎంసీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో పాఠకులకు చేరువ కావాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ



నగరం: సమయపాలన పాటిస్తూ పాఠకులకు గ్రంథాలయ సేవలు నిరంతరం అందే విధంగా విధులు చేపట్టాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ సూచించారు. మండలంలోని మంత్రిపాలెం శాఖా గ్రంథాలయాన్ని బుధవారం సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాఠకులకు అవసరమైన పుస్తకాలు, ఇతర దిన పత్రికలను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రంథాలయంలో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని రికార్డుల్లో నమోదు చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా రికార్డులను, గ్రంథాలయ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జ్ అధికారి జొన్న బ్రహ్మేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణయుగాన్ని తలపించేలా జగనన్న పాలన

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈవూరి గణేష్



సంక్షేమ లబ్ధి వివరాలను ప్రజలకు తెలియజేస్తున్న ఈవూరి గణేష్

రేపల్లెరూరల్: స్వర్ణ యుగాన్ని తలపించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. 'సిద్ధం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని మైనేనివారి పాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఇంటింటా ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా జగనన్న వివిధ రంగాలలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. విద్యతోనే పేదవాని అభివృద్ధి సాధ్యమని గ్రహించిన జగనన్న విద్యా రంగానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. నాడు-నేడు పేరుతో విద్యారంగాన్ని ప్రక్షాళన చేశారని అన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖల్ని మార్చటంతో పాటు ఆంగ్ల మాధ్యమ బోధనను విద్యార్థులకు అందిస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామ గ్రామానా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్యాన్ని ప్రజల ముంగిటకే తీసుకువచ్చారన్నారు. ప్రజల కోసం ఇంత చేస్తున్న జగనన్నకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకురాలు ఈవూరు కేశవతి, సృజన్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోండి

తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ రవి కిషోర్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రవి కిషోర్

నగరం: తపాలాశాఖ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ శొంఠి రవికిషోర్ సూచించారు. 'జనం లోకి మనం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని సజ్జావారిపాలెం గ్రామంలో బుధవారం ప్రజలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా కోట్ల మంది ప్రజలకు వివిధ రకాల సేవలు అందిస్తున్న అతిపెద్ద సంస్థ తపాలా శాఖ అని అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి రాజధాని వరకు విస్తరించి అనేక సేవలను ప్రజలకు అందిస్తోందన్నారు. డబ్బులను పొదుపు చేసుకోవటం, ఫిక్సిడ్ డిపాజిట్‌ల సేకరణ, డబ్బులను ఇతరులకు పంపటం వంటి బ్యాంకింగ్ సేవలతో పాటు బీమా సేవలు సైతం అందిస్తోందన్నారు. పోస్ట్, స్పీడ్ పోస్ట్ వంటి సమాచారం అందజేత లోనూ ముందుంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సోలార్ రూఫ్‌టాప్ ప్యానెళ్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పోస్టల్ అకౌంట్‌లు, పోస్టల్ ఇన్సూరెన్స్‌లపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రేపల్లె సబ్‌డివిజన్ అధికారి కే.ఏడుకొండలు, అధికారులు పి.నరేంద్ర, బి.కిరణ్, బీపీఎంలు, ఏబీపీఎంలు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి చేసిన 11 మందిపై కేసు నమోదు

కొల్లూరు : రెండు సామాజిక వర్గాల నడుమ చోటు చేసుకున్న కొట్లాటలో ఘర్షణలకు సంబంధం లేని మరో సామాజిక వర్గానికి చెందిన యువకుడిపై విచక్షణా రహితంగా దాడి చేసిన 11 మంది వ్యక్తులపై బాధిత యువకుడి ఫిర్యాదు మేరకు కొల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొల్లూరు అనంతభోగేశ్వర స్వామి తిరునాళ్ల నేపథ్యంలో గత ఆదివారం రాత్రి ఇరు సామాజిక వర్గాలకు చెందిన యువకుల నడుమ కొట్లాట చోటు చేసుకుంది. అనంతరం కొల్లూరు ఎస్సీ కాలనీకి చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యువకులు మూకుమ్మడిగా వీధుల్లోకి వచ్చి ఆందోళనలకు దిగారు. అదే సమయంలో కొల్లూరు గ్రోమోర్ సెంటర్ వద్ద ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు భారీ సంఖ్యలో ఓ ద్విచక్ర వాహనాన్ని దగ్ధం చేస్తూ విధ్వంసక చర్యలకు దిగారు. ఆ సమయంలో ట్రాఫిక్ నిలిచిపోవడంతో కారులో మరో ప్రాంతం నుంచి వస్తున్న మండలంలోని గాజుల్లంకకు చెందిన కాపు సామాజిక వర్గానికి చెందిన యువకుడు సనక సాంబయ్యనాయుడు తన వెంబడి ఉన్న మరో యువకుడితో కలసి కారు దిగి నడుచుకుంటూ వెళుతున్న క్రమంలో అల్లర్లకు దిగిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యువకులు వీరిని గమనించి కాపు సామాజిక వర్గానికి చెందిన వారిగా గుర్తించి ఒక్కసారిగా దాడికి తెగబడ్డారు. సాంబయ్య నాయుడును పదుల సంఖ్యలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు చుట్టుముట్టి కర్రలు, రాళ్లతో విచక్షణా రహితంగా కొట్టి గాయపర్చారు. వారి దాడి నుంచి తప్పించుకున్న సాంబయ్యను స్థానికులు గుంటూరులోని ఓ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. దాడితో తీవ్ర గాయాలకు గురైన సాంబయ్య వైద్యశాలలో అందించిన ఫిర్యాదు మేరకు కనపాల చందు, అతని సోదరుడు కనపాల రాజేంద్ర, వెంకటేష్, చొప్పర వంశీ, రాఘవ, కూచిపూడి జగదీష్, సుష్మంత్, తేజ, చంద్రశేఖర్, నాని మరి కొందరి యువకులపై కొల్లూరు ఎస్ఐ రవీంద్రరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఎల్‌వీ ప్రసాద్ నేత్రాలయం సిబ్బంది

చెరుకుపల్లి: డాక్టర్ ఎన్టీర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం వారు అందించే సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్ అన్నారు. ఈ నెల 9 నుంచి 15 వరకు బాపట్ల ఎన్టీర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం వారు మండల పరిధిలోని ఆరుంబాక, కావూరు గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఇందులో భాగంగా బుధవారం కావూరు గ్రామంలోని గ్రంథాలయం వద్ద ఎల్‌వీ ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి కంటి సమస్యలు ఉన్న 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం కావూరు, ఏమినేనివారి పాలెం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో క్విజ్ మరియు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సంస్థ వైద్యులు డాక్టర్ నద్యాల పిచ్చిరెడ్డి, టెక్నీషియన్స్ కట్ట సురేష్, చింతా బాబ్జి, వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు

ప్రత్తిపాడు: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు చేయడం జరుగుతుందని గుంటూరు-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చల్లా రమేష్ హెచ్చరించారు. వట్టిచెరుకూరు మండలంలో బుధవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు స్థానిక సిబ్బందితో కలిసి ఆకస్మికంగా విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక సబ్‌స్టేషనులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈఈ వివరించారు. 49 సర్వీసులకు అదనపు లోడ్ కింద రూ.2.70 లక్షలు అపరాధ రుసుములుగా విధించినట్లు తెలిపారు. 60 మంది సిబ్బంది 31 బృందాలుగా ఏర్పడి 2,046 సర్వీసులు తనిఖీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీరు పి. విజయ్‌కుమార్, డీఈఈలు మల్లికార్జునరావు, గురునాథరావు, అశోక్, టూటౌన్ ఏఈలు పాల్గొన్నారు.

వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

గనికపూడి (ప్రత్తిపాడు): మండల పరిధిలోని గనికపూడిలో బుధవారం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ ఎస్‌కే మహమ్మద్, గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరియునిస్‌లు హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ యునిస్ మాట్లాడుతూ ఇక నుంచి హెల్త్ క్లినిక్ వేదికగానే వ్యాక్సినేషన్, ఫ్యామిలీ ఫిజీషియన్ సర్వీసులు, గర్భవతులకు అందించే అన్ని రకాల సేవలను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫాతిమా, ఎంపీహెచ్ఈవో చెల్లమ్మ, పీహెచ్ఎన్ నిర్మల, హెచ్‌వీ విజయకుమారి, ఏఎన్ఎం అనిత తదితరులు పాల్గొన్నారు.